

జగనన్న సురక్ష

జగనన్న సురక్షలో 3,46,712 మందికి సేవలు అందాయని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్ చెప్పారు.

8లో



ఈ-బుక్స్ ప్రారంభం

విశాఖ: ఏయూ గ్రంథాలయంలో ఈ-బుక్స్, జర్నల్స్ సదుపాయాన్ని వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి శుక్రవారం ప్రారంభించారు.



శ్రీవారికి పట్టువస్త్రాలు

కొమ్మాది: రుషికొండలోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం భక్తులు పట్టువస్త్రాలను సమర్పించారు.

న్యూస్‌రీల్

7న సీఎం జగన్ కూనవరం పర్యటన



కూనవరం (అల్లూరి సీతారామరాజు జిల్లా): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈనెల 7వ తేదీ సోమవారం ఉదయం 8 గంటలకు కూనవరంలో పర్యటించనున్నారు. గోదావరి వరద ముంపు ప్రాంతాల్లో బాధితులను నేరుగా కలిసి వారి కష్ట సుఖాలను తెలుసుకుంటారని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంత ఉదయభాస్కర్ శనివారం తెలిపారు. ఈనెల 4న కూనవరంలో జరగాల్సిన సీఎం పర్యటన వాయిదా పడిన విషయం తెలిసిందే.

మునగపాక పీఏసీఎస్‌కు ఉత్తమ పురస్కారం



అవార్డు స్వీకరిస్తున్న మునగపాక పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి రామ్మోహనరావు

మునగపాక: రాష్ట్ర సహకార, వ్యవసాయ శాఖామంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డి నుంచి మునగపాక పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి కోనపల్లి రామ్మోహనరావు ఉత్తమ సొసైటీ పురస్కారాన్ని శుక్రవారం అందుకున్నారు. రైతులకు మెరుగైన సేవలందించడంతో పాటు డిపాజిట్ల సేకరణ, చిరు వ్యాపారులకు భరోసాగా నిలవడంలో మునగపాక పీఏసీఎస్ ఉత్తమ సొసైటీగా ఎంపికైన విషయం తెలిసిందే. విజయవాడలో నిర్వహించిన ఆప్కాబ్ వజ్రోత్సవంలో సొసైటీ అధ్యక్షులు రామ్మోహనరావు ఈ అవార్డును మంత్రి చేతులమీదుగా అందుకున్నారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ కోలా గురువులు, సీఈవో డీవీఎస్ వర్మ, మునగపాక సంఘ సీఈవో ఆడారి వేణుగోపాలరావులు పాల్గొన్నారు.

నెలాఖరుకు జగనన్న గృహప్రవేశాల లక్ష్య సాధన



జగనన్న గృహ నిర్మాణాలపై ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమీక్షిస్తున్న డీఈ ప్రసాద్

నర్సీపట్నం: ప్రభుత్వం నిర్దేశించిన జగనన్న గృహప్రవేశాల లక్ష్యాన్ని అధిగమించాలని జిల్లా హౌసింగ్ కార్యాలయ డీఈ ప్రసాద్ పేర్కొన్నారు. నర్సీపట్నం మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం జగనన్న గృహాలపై నియోజకవర్గస్థాయి సమీక్ష నిర్వహించారు. సచివాలయాల వారీగా గృహనిర్మాణాలపై ఇంజినీరింగ్ అసిస్టెంట్లను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 15,984 ఇళ్లు లక్ష్యం కాగా 14,400 ఇళ్లు పూర్తి చేశామన్నారు. నర్సీపట్నం నియోజకవర్గంలో 2,521 ఇళ్లకు 2,232 పూర్తి చేశామన్నారు. మిగిలిన ఇళ్లను ఈ నెలాఖరు నాటికి పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అసిస్టెంట్లను ఆదేశించారు. లక్ష్యాన్ని చేరుకోకపోతే సంబంధిత ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు షోకాజ్ నోటీసులు ఇస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో నాలుగు మండలాలకు చెందిన హౌసింగ్ ఏఈలు పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణ దేశ సేవతో సమానం



నాటడానికి మొక్కలతో సిద్ధమైన అధ్యాపకులు, జవాన్లు, విద్యార్థులు

మధురవాడ: పర్యావరణ పరిరక్షణలో ఎంతో ముఖ్య భూమిక పోషిస్తున్న మొక్కలు నాటి, సంరక్షించడం కూడా దేశానికి సేవ చేయడం వంటిదేనని విశాఖపట్నం 198 సీఆర్‌పీఎఫ్ డిప్యూటీ కమాండెంట్, ప్లాంటేషన్ డ్రైవ్ నోడల్ ఆఫీసర్ భగత్‌సింగ్ తెలిపారు. శుక్రవారం మధురవాడ గాయత్రి వైద్య కళాశాలలో విశాఖపట్నం 198 సీఆర్‌పీఫ్ బెటాలియన్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఆజాదీకా అమృత్ మహోత్సవ్ ముగింపు దశకు వస్తున్న తరుణంలో మేరా మాటీ మేరా దేశ్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థినులు మొక్కలు నాటడంతో సంరక్షిస్తామంటూ వాటికి రాఖీలు కట్టారు. ఈ సందర్భంగా భగత్‌సింగ్ మాట్లాడారు.

పక్కాగా.. ఓటర్ల లెక్క

ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో అధికారులు నిరంతరం శ్రమిస్తున్నారు. బీఎల్వోల సాయంతో ఇంటింటి సర్వేను పక్కాగా నిర్వహిస్తున్నారు. ఎలాంటి ఆరోపణలకు తావీయకుండా, పారదర్శకంగా సర్వే చేపట్టేందుకు రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి నేతృత్వంలోని అధికారుల బృందం నిరంతరం సమీక్షిస్తోంది. మరో 15 రోజుల్లో తొలి జాబితా రూపకల్పనకు సిద్ధమైంది.



ఎన్నికల అధికారుల సమావేశంలో జిల్లా రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రవి పట్టాన్ శెట్టి, డీఆర్వో వెంకటరమణ

- 15 రోజుల్లో సిద్ధం కానున్న ఓటరు జాబితా
- ముమ్మరంగా ఇంటింటి ఓటరు సర్వే
- జిల్లా వ్యాప్తంగా 30 హెల్ప్‌డెస్క్‌లు

సాక్షి, అనకాపల్లి: జిల్లాలో ఇంటింటీ ఓటర్ సర్వే, ఓటర్ సవరణ, నమోదు ప్రక్రియ శరవేగంగా సాగుతోంది. గత నెల 21న ప్రారంభమైన ఓటర్ సర్వే ప్రక్రియ నెల రోజుల పాటు జరగనుంది. ఇప్పటికే 15 రోజులు పూర్తయింది. జిల్లాలో ఓటరు సవరణ ప్రక్రియపై జిల్లా కలెక్టర్, రిటర్నింగ్ అధికారి రవిపట్టాన్ శెట్టి అధ్యక్షతన డీఆర్వో వెంకటరమణ ఎప్పటికప్పుడు సమీక్ష సమావేశాల ద్వారా ఆరా తీస్తున్నారు. ఓటర్లు ఫిర్యాదు చేసేందుకు జిల్లా పరిధిలోని 7 నియోజకవర్గాల్లో 30 హెల్ప్‌డెస్క్‌లను ఏర్పాటు చేశారు. కలెక్టరేట్, జిల్లా ఎన్నికల అధికారి కార్యాయంలో ప్రత్యేక హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేశారు. 1950 టోల్‌ఫ్రీ నంబర్‌ను అందుబాటులోకి తెచ్చారు.

ఆ మూడు ఫాంలు ప్రధానం

ఓటరు సవరణలకు సంబంధించి మూడు ఫాంలను ఎన్నికల సంఘం అందుబాటులోకి తెచ్చింది. 17 ఏళ్లు నిండిన వారు భవిష్యత్తు ఓటరుగానూ, 18 ఏళ్లు నిండినవారు యువ ఓటరుగా నమోదు చేసుకోవచ్చు. ఇందుకోసం ఫాం-6 అందించాలి. ఓటరును జాబితా నుంచి తొలగించేందుకు ఫాం-7, ఓటరు కార్డు బదిలీ, చిరునామా మార్పు, కొత్త గుర్తింపు కార్డు జారీ, సవరణలకు ఫాం-8ను సమర్పించాలి. ఈ మూడూ ఇంటింటి సర్వేకు వచ్చే బీఎల్వోల వద్ద ఉంటాయి. అవసరమైన వారు వీటిని వినియోగించుకోవాలి.

కుటుంబమంతా ఒకే బూత్‌లో ఉండేలా

గతంలో ఒక కుటుంబంలో భార్య, భర్తలకు వేర్వేరు పోలింగ్ బూత్‌లలో ఓటు ఉందనే ఫిర్యాదులు ఎక్కువగా వచ్చాయి. ఇకపై ఆ సమస్య తలెత్తకుండా చర్యలు చేపడుతున్నారు. ఒక కుటుంబంలోని ఓట్లను వేర్వేరు బూత్‌ల పరిధిలో కాకుండా, ఒకే బూత్‌లో ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. ఆగస్టు 22 నుంచి సెప్టెంబర్ 29 వరకూ పోలింగ్ స్టేషన్ల రేషనలైజేషన్, రీ ఎరేంజ్‌మెంట్స్ ప్రక్రియ జరగనుంది. ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం రూరల్ పరిధిలో ప్రతి బూత్ లో 1500, అర్బన్ పరిధిలో 1200 ఓట్లకు మించకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఈ విభజన క్రమంలో కుటుంబ సభ్యుల ఓట్లు తారుమారైతే, ఆ సమయంలో వారు దరఖాస్తు చేసుకుని, ఏ బూత్‌లో ఉండాలో నిర్ణయించుకోవచ్చు.

రెండు చోట్ల ఓటుంటే ఓటరుదే నిర్ణయం

ఓటరుకు రెండు చోట్ల ఓటు ఉంటే దేనిని తొలగించాలో సదరు ఓటరు అభిప్రాయాన్నే తీసుకోవాలని బీఎల్వోలకు అధికారులు శిక్షణలో తెలిపారు. ముందుగా ఓటరుకు నోటీసు ఇచ్చిన తర్వాత, దానిపై నిర్ణయం తీసుకోవాలన్నారు. చనిపోయినవారి ఓటు తీసేయాలన్నా ఆ కుటుంబానికి నోటీసు ఇవ్వాల్సిందే. డెత్ సర్టిఫికెట్ ఆధారంగానే సదరు ఓటును తొలగించాలి. మీ ఓటు ఉందో లేదో తెలుసుకోవాలంటే https://voters.eci.gov. in/ వెబ్‌సైట్ ద్వారా లేదా voterhelpline మొబైల్ యాప్ సాయంతో తెలుసుకోవచ్చు.



ఇంటింటి ఓటర్ సర్వేలో వివరాలు అడుగుతున్న అనకాపల్లి ఆర్డీవో చిన్నికృష్ణ(ఫైల్)

పకడ్బందీగా ఓటర్ సర్వే: కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

ఇంటింటి ఓటరు సర్వే క్షుణ్ణంగా చేసి జిల్లాలో ఓటర్ల జాబితాను పక్కాగా రూపొందించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి ఎలక్టోరల్ అధికారులను ఆదేశించారు. జిల్లా పరిధిలో ఏ ఒక్కరి ఓటు కనిపించలేదని భావిస్తున్నా వారు నేరుగా సంబంధిత బూత్ లెవల్ అధికారికైనా, ఏ ఒక్క ఎన్నికల అధికారికైనా ఫిర్యాదు చేస్తే తక్షణమే చర్యలు తీసుకుంటామన్నారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో ఓటర్ల జాబితాపై సమీక్షా సమావేశం నిర్వహించారు. పొరపాట్లకు తావీయకుండా పారదర్శకంగా అర్హులందరి ఓట్లు ఉండేలా జాగ్రత్త వహించాలన్నారు. ప్రతీ బుధవారం జిల్లా స్థాయి సమావేశం, మంగళవారం నియోజకవర్గ స్థాయి సమావేశాలను ఏర్పాటు చేసి వివరాలను నివేదించాలన్నారు. నిబంధనల మేరకు ఓటర్ల మార్పులు, చేర్పులను సవరించి, 15 రోజుల్లో పూర్తి జాబితాను సిద్ధం చేయాలని ఆదేశించారు. ఓటరును తొలగించే క్రమంలో స్పష్టమైన పరిశీలన, ఫాం-7 తప్పక ఉండాలన్నారు. వందమంది ఓటర్లలో రెండుకు మించి తొలగింపులు ఉంటే ఏఆర్వో/ అదనపు ఏఆర్వో దృష్టికి తీసుకురావాలన్నారు. 18 ఏళ్ల వయస్సు దాటిన వారిని గుర్తించి, ఓటర్లుగా నమోదు చేయాలన్నారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ స్మరణ్ రాజ్, జిల్లా ఉప ఎన్నికల అధికారి పి.వెంకటరమణ, అనకాపల్లి, నర్సీపట్నం ఆర్డీవోలు చిన్ని కృష్ణ, జయరాం, స్పెషల్ సబ్‌కలెక్టర్లు ప్రమీలగాంధీ, అనిత, జ్ఞానవేణి, రామలక్ష్మి, తహసీల్దార్లు ఎం.వి.రత్నం, భాగ్యవతి, తిరుమల బాబు, అన్నాజీరావు, ఏ-సెక్షన్ సూపరింటెండెంట్ లక్ష్మీదేవి, డి.టి.రవికుమార్ పాల్గొన్నారు.

ప్రగతి పరుగులు పెట్టాలి



యలమంచిలి నియోజకవర్గ అభివృద్ధి సమీక్షలో మాట్లాడుతున్న ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర, చిత్రంలో కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, ఎమ్మెల్యే కన్నబాబురాజు, జేసీ జాహ్నవి

- ప్రతిపాదిత ప్రాజెక్టులు పూర్తయితే 'యలమంచిలి'కి మహర్దశ
- నియోజకవర్గ సమీక్షలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి రాజన్నదొర

తుమ్మపాల: పూడిమడక జెట్టీ, కొండకర్ల ఆవ సుందరీకరణ, అనకాపల్లి-అచ్యుతాపురం రోడ్డు విస్తరణ వంటి ఎన్నో ప్రతిష్ఠాత్మకమైన ప్రాజెక్టులను యలమంచిలి నియోజకవర్గంలో చేపట్టామని ఉపముఖ్యమంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. ఇవన్నీ పూర్తయితే నియోజకవర్గం రూపురేఖలే మారిపోతాయన్నారు. కలెక్టర్ కార్యాలయంలో యలమంచిలి నియోజకవర్గ అభివృద్ధిపై శుక్రవారం ఆయన అన్ని శాఖల అధికారులతో సమీక్షించారు. యలమంచిలి పట్టణ అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, రైల్వే ఫ్లైఓవర్ వంటి అభివృద్ధి పనులను అధికారులు సమన్వయంతో పూర్తి చేయాలన్నారు. నియోజకవర్గంలో అమలు చేస్తున్న అభివృద్ధి పనులు, అవసరమైన చర్యల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ పనుల గురించి ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు (కన్నబాబు) మంత్రి దృష్టికి తీసుకురాగా.. అటువంటి పనులపై కలెక్టర్ దృష్టి సారించి వేగవంతం చేయాలని డిప్యూటీ సీఎం ఆదేశించారు. ఇళ్ల నిర్మాణాలు, వైఎస్సార్ ఆరోగ్య కేంద్రాల నిర్మాణం, జల్‌జీవన్ మిషన్, పూడిమడక వాటర్ స్కీం, నాడు నేడు పనులు, పాఠశాలల్లో మౌలిక వసతులు వంటి అనేక పథకాల అమలు తీరును కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి వివరించారు. ప్రభుత్వం నుంచి మంజూరు కావలసిన నిధులు, అనుమతుల గురించి వివరించారు.

జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి, అసిస్టెంట్ కలెక్టర్ స్మరణ్‌రాజ్, సీపీవో జి.రామారావు, డీఆర్‌డీఏ పీడీ లక్ష్మీపతి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మోహనరావు, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్ ఈఈలు రమేష్, వీరునాయుడు, జిల్లా పంచాయతీ అధికారి శిరీషరాణి, మహిళా స్త్రీ శిశు సంక్షేమ శాఖ పీడీ అనంతలక్ష్మి, నియోజకవర్గ అధికారులు సమీక్ష సమావేశంలో పాల్గొన్నారు.

జగనన్నను ఎదుర్కోలేక..

ఈనాడు రామోజీ తప్పుడు రాతలు

- దొప్పెర్లలో ముగ్గురు సరోజారావులు ఉంటే తన తమ్ముడిపైనే అసత్య ఆరోపణలు
- మా పరువుకు భంగం కలిగించే వారిపై పరువు నష్టం దావా
- ఈనాడు వార్తపై దొప్పెర్ల సర్పంచ్ చిన్నారావు ధ్వజం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న దొప్పెర్ల సర్పంచ్ చిన్నారావు

అచ్యుతాపురం (అనకాపల్లి): ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డిని ఎదుర్కోలేక ఈనాడు రామోజీ తమలాంటి చిన్న నాయకులపై అసత్య ఆరోపణలతో కూడిన కథనాలను ప్రచురిస్తున్నారని అచ్యుతాపురం మండలంలోని దొప్పెర్ల సర్పంచ్ చిన్నారావు ధ్వజమెత్తారు. అచ్యుతాపురంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2018లో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు నమోదైన ఓటర్ల జాబితాలోని పేర్లను.. తాము చేర్పించామని ఎలా కథనాలు రాశారని ప్రశ్నించారు. దొప్పెర్ల గ్రామంలో ముగ్గురు సరోజారావులు ఉంటే తన తమ్ముడైన సరోజారావు తండ్రిగా 37 మంది ఓటర్ల పేర్లు నమోదయ్యాయని కథనంలో పేర్కొనటం సరి కాదన్నారు. క్లరికల్ తప్పిదం వల్ల నమోదైన వివరాలపై దర్యాప్తు జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఒకే ఇంటిలోని ఇద్దరు అన్నదమ్ములు బీఎల్‌వోలుగా వ్యవహరించడంపై కూడా దృష్టి పెట్టాలన్నారు. 2014 నుంచి తమపై అనేక కథనాలతో దాడి చేస్తున్నారని, తాము కేసులను సైతం ఎదుర్కొన్నామని ఆవేదన వ్యక్తం చేశారు. 15 ఏళ్ల క్రితం తమ ఆస్తులు, ఇప్పటి ఆస్తులపై ఎటువంటి దర్యాప్తయినా చేసుకోవచ్చని సవాల్ విసిరారు. ఇన్వెస్టిగేటివ్ జర్నలిజం చేసే వారు నిజాలు రాయాలని హితవు పలికారు. అచ్యుతాపురం మండలంలో ఎవరు దందాలు నిర్వహిస్తున్నారో అందరికీ తెలుసని వ్యాఖ్యానించారు. తమ పరువుకు భంగం కలిగించే రీతిలో కథనాలు రాసేవారిపై చట్టపరంగా పోరాడుతామన్నారు. తమను లక్ష్యంగా చేసుకొని కథనాలు రాస్తున్న జర్నలిస్టు ఆస్తులపై కూడా దర్యాప్తు చేయాలని కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. పరువు కోసం రాజకీయాల్లో ఉన్నామని తమ కుటుంబం పట్ల తప్పుడు వార్తలు రాస్తున్న వారిపై కోర్టులో పోరాడతామని తెలిపారు.

'శారద' నీరు విడుదల



తుమ్మపాల ఇరిగేషన్ మెయిన్ చానల్ తలుపులు తెరిపిస్తున్న ఏఈ హనుమంతురావు, రైతు సంఘం అధ్యక్షుడు పీలా బుజ్జి

తుమ్మపాల: తుమ్మపాల ఇరిగేషన్ మెయిన్ చానల్ ద్వారా తుమ్మపాల, బవులువాడ, మార్టూరు, రేబాక, కాపుశెట్టివానిపాలెం, శంకరం గ్రామాలకు శారదా నది ఏటికాలువ నీరు అందుతుందని ఇరిగేషన్ ఏఈ హనుమంతురావు చెప్పారు. మండలంలో తుమ్మపాల మెయిన్ చానల్‌ను ఆయన శుక్రవారం పరిశీలించి గేట్ల తలుపులు తెరిపించి, నీరు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రధాన చానల్ ద్వారా ఏటికాలువ నీరు దాదాపు 1600 ఎకరాల ఆయకట్టు భూములకు చేరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం అధ్యక్షుడు పీలా బుజ్జి, పెతకంశెట్టి బలరాం, పిల్లా మురళి, కొణతాల రాజు, కె.అప్పారావు పాల్గొన్నారు.

రూ.27 కోట్లతో అనకాపల్లి రైల్వేస్టేషన్ అభివృద్ధి

ప్రధాని మోదీచే వర్చువల్‌గా శంకుస్థాపన రేపు



స్థానిక మీడియాతో విజయవాడ నుంచి వర్చువల్‌గా మాట్లాడుతున్న డీఆర్‌ఎం నరేంద్ర ఆనందరావుపాటిల్

అనకాపల్లి టౌన్: అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా శుక్రవారం స్థానిక రైల్వే స్టేషన్‌లో విజయవాడ రైల్వే డీఆర్ఎం నరేంద్ర ఆనందరావుపాటిల్ వర్చువల్‌గా విలేకరులతో మాట్లాడారు. స్టేషన్‌ను రూ.27 కోట్లతో అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. అభివృద్ధి పనులకు ఈ నెల 6న ఉదయం 11 గంటలకు ప్రధాని నరేంద్రమోదీ వర్చువల్‌గా ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. స్టేషన్‌లో 5జీ ఇంటర్‌నెట్ సేవలు, ప్రయాణికులకు మెరుగైన వసతులు, అదనపు సౌకర్యాలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. స్టేషన్‌కు ఇరువైపుల నుంచి వచ్చే ప్రయాణికులకు వీలుగా రెండు వేపులా టికెట్ విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేస్తామన్నారు. దక్షిణమధ్య రైల్వే పరిధిలో భారత్ అమృత్ స్టేషన్‌లుగా అభివృద్ధి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం 112 స్టేషన్లను గుర్తించిందన్నారు. తొలిదశలో రాష్ట్రంలో 11 స్టేషన్లలో అభివృద్ధి పనులు ప్రారంభిస్తామని, ఇందులో భాగంగానే అనకాపల్లి స్టేషన్ అభివృద్ధి పనులకు కూడా ఈ నెల 6న భూమి పూజ చేయనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో విజయవాడ రైల్వే డివిజనల్ ఏడీఆర్ఎం శ్రీనివాసరావు, సీనియర్ డీసీఎం(కమర్షియల్) వి.రాంబాబు, అనకాపల్లి స్టేషన్ మేనేజర్ బి.వెంకటేశ్వరావు, చీఫ్ బుకింగ్ సూపర్‌వైజర్ దేవరకొండ కామేష్ పాల్గొన్నారు.

ఎన్టీఆర్ ఆస్పత్రిలో త్వరలో క్రిటికల్ కేర్ యూనిట్



రోగులకు అందుతున్న సేవలపై ఆర్‌ఎంవోతో మాట్లాడుతున్న రామ్మూర్తి

అనకాపల్లి టౌన్: స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయంలో రూ.22 కోట్ల నిధులతో 50 పడకల క్రిటికల్ కేర్ యూనిట్‌ను త్వరలో ఏర్పాటు చేస్తున్నట్టు ఆస్పత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్లు జి.రామ్మూర్తి, ఎ.వి.రత్నకుమారి, మూసూరు శ్రీను శుక్రవారం ఆస్పత్రిలో వివిధ విభాగాలను పరిశీలించారు. ఈ సందర్భంగా రామ్మూర్తి మాట్లాడుతూ క్రిటికల్ కేర్ యూనిట్ వలన అత్యవసర కేసులకు ఇక్కడే వైద్యం అందించే అవకాశం కలుగుతుందన్నారు. వైద్యాలయం సూపరింటెండెంట్ శ్రావణ్‌కుమార్, ఆర్ఎంవో లక్ష్మణ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి స్టార్టప్‌లు దోహదం

బీచ్‌రోడ్డు: దేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి స్టార్టప్‌లు ఎంతగానో దోహదపడతాయని సీఐఐ విశాఖపట్నం వైస్ చైర్మన్ రాజేష్ గ్రంధి అన్నారు. నగరంలోని ఓ హోటల్‌లో యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ సహకారంతో శుక్రవారం వై20 బ్రెయిన్ స్ట్రోమింగ్ సెషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం దేశంలో 670 జిల్లాల్లో 99,000 గుర్తింపు పొందిన స్టార్టప్‌లతో.. ప్రపంచంలోనే మూడవ అతిపెద్ద స్టార్టప్ ఎకోసిస్టమ్ కలిగి ఉన్నామన్నారు. 338.50 బిలియన్ల డాలర్ల విలువైన 105 యూనికార్న్‌లను కలిగి ఉన్నట్లు వెల్లడించారు.

2025 నాటికి రెండో స్థానం చేరుకుంటామని అంచనా వేశారు. భారత్‌లో నమోదైన స్టార్టప్‌లలో దాదాపు సగం టైర్-2, టైర్-3 నగరాలకు చెందినవే అన్నారు. స్టార్టప్‌లపై విస్తృత ప్రచారం, నిబంధనలు సులభతరం చేయడంతో పాటు ప్రభుత్వాలు మద్దతుగా నిలుస్తున్నాయని చెప్పారు.

సుభోజనానికి రూ.35లక్షల విరాళం



హోమీ బాబా ఆస్పత్రిలో సుభోజనం వడ్డిస్తున్న దాత అంకినీడు ప్రసాద్

- ఏడాది పాటు నిర్వహణకు ముందుకొచ్చిన ఎన్ఆర్ఐ

అగనంపూడి: హరేకృష్ణ మూమెంట్, విశాఖపట్నం సారథ్యంలో అగనంపూడి సమీపంలో హోమీబాబా క్యాన్సర్ ఆస్పత్రిలోని రోగులు, వారి సహాయకులకు ఏడాది పాటు మధ్యాహ్న భోజనం అందించేందుకు హైదరాబాద్‌కు చెందిన ఎన్ఆర్ఐ ముందుకొచ్చారు. నెలన్నర కిందట ఇక్కడ 450 మందికి సుభోజన కార్యక్రమాన్ని ప్రారంభించారు. హరేకృష్ణ మూమెంట్ ద్వారా ఈ విషయం తెలుసుకున్న ఎన్ఆర్ఐ కోసూరు అంకినీడు ప్రసాద్ శుక్రవారం సుభోజన కార్యక్రమాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. రోగులు, వారి సహాయకులకు భోజనం వడ్డించి, వారి నుంచి అభిప్రాయాలు సేకరించారు. ఏడాది పాటు ఈ కార్యక్రమ నిర్వహణకు అయ్యే ఖర్చు రూ.35 లక్షలు చెల్లించేందుకు ముందుకొచ్చారు. తర్వాత ఏడాది కూడా కొనసాగిస్తానని సూచనప్రాయంగా చెప్పారు. హరేకృష్ణ మూమెంట్ విశాఖ అధ్యక్షుడు యదురాజాదాస మాట్లాడుతూ దాత అంకినీడు ప్రసాద్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమానికి దాతలు సహకారం అందించాలని భావిస్తే 96667 62108కు సంప్రదించాలని కోరారు.

టెక్నాలజీని అందిపుచ్చుకోవాలి



గైస్ విద్యార్థినికి ఉద్యోగ నియామక పత్రాలు అందిస్తున్న కమిషనర్ నాగరాణి

మురళీనగర్ (విశాఖ ఉత్తర): మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా మనం మారాలని రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ సి.నాగరాణి చెప్పారు. విశాఖ పర్యటనలో భాగంగా ఆమె కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీని శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా సిబ్బందితో సమావేశమయ్యారు. ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం సాంకేతిక విభాగంలో ఆనేక విప్లవాత్మక మార్పులు వచ్చాయన్నారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంచుకునే విధంగా తర్ఫీదు ఇవ్వాల్సి ఉందన్నారు. ఇండస్ట్రియల్ కనెక్టెడ్ కోర్సులను నేర్చుకునే విధంగా విద్యార్థులను ప్రోత్సహించాలని చెప్పారు. ప్రస్తుతం ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, మెకట్రానిక్స్, రోబోటిక్స్, ఏఆర్‌వీఆర్, సీఎన్‌సీ, డ్రోన్ టెక్నాలజీ వంటి కోర్సులు చేసిన వారికి మంచి ఉపాధి అవకాశాలు ఉన్నాయని ఆమె వివరించారు. సంప్రదాయ కోర్సులతో పాటు ఉపాధి అవకాశాలు పెంచే కోర్సులకు ప్రాధాన్యతనివ్వాలన్నారు.


క్యాంపస్ ఇంటర్వ్యూలకు ప్రాధాన్యత

ఈ ఏడాది కూడా పరిశ్రమల అవసరాలను తీర్చే విధంగా ఎక్కువ మంది ఉద్యోగాల్లో చేరేందుకు విద్యార్థులకు తర్ఫీదు ఇవ్వాలన్నారు. ఇంటర్వ్యూలకు అవసరమైన పరిజ్ఞానాన్ని అందించే విధంగా శిక్షణ నివ్వాలన్నారు. ఇందుకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. పరిశ్రమలకు అవసరమైనంత మందిని మనం ఇవ్వాల్సి ఉందన్నారు. కెరీర్ గైడెన్స్ ఇవ్వాలన్నారు. పాలిటెక్నిక్ కోర్సు పూర్తికాగానే వంద శాతం మంది విద్యార్థులు ఉద్యోగాలు పొందే విధంగా కృషి జరగాలన్నారు. కంపెనీలతో ఎంఓయూలు చేసుకోవడంతో పాటు వారితో నిరంతరం సంబంధాలు కొనసాగిస్తూ సమన్వయంతో పనిచేయాలన్నారు. కాలేజీ సిబ్బంది వారి బ్రాంచ్‌లకు సంబంధించిన ఆధునిక పోకడలను తెలుసుకుంటూ విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంచే విధంగా నూతన ప్రాజెక్టులు రూపొందించేందుకు కృషి చేయాలన్నారు. నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రిడిటేషన్‌కు (ఎన్‌బీఏ) విశాఖ నగరం నుంచి అన్ని పాలిటెక్నిక్ కాలేజీలు చెందిన అన్ని బ్రాంచ్‌లు గుర్తింపు పొందాలన్నారు. రాష్ట్రంలో ఇప్పటివరకు ఆముదాలవలస, శ్రీకాకుళం, అనకాపల్లి, విజయవాడ, గన్నవరం, కుప్పం, కళ్యాణ దుర్గం ప్రభుత్వ పాలిటెక్నిక్‌లకు ఎన్‌బీఏ గుర్తింపు పొందినట్లు చెప్పారు. ఇతర కాలేజీలు కూడా ఎన్‌బీఏ గుర్తింపు పొందే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. విశాఖపట్నం పాలిటెక్నిక్ కాలేజీ కూడా ఎన్‌బీఏ గుర్తింపునకు వెంటనే వెళ్లాలని ఆమె ఆదేశించారు.

ఈ సందర్భంగా ఇటీవల బిర్లా కంపెనీలో ఉద్యోగాలు పొందిన ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీ (గైస్) బాలికలకు నియామకపత్రాలను ఆమె అందించారు. ఈ కార్యక్రమంలో సాంకేతిక విద్యాశాఖ ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ విభాగం డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఎంఏవీ రామకృష్ణ, పాలిటెక్నిక్ కాలేజీ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కేడీవీ నరసింహారావు, కంచరపాలెం కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె సెమ్స్‌ను సందర్శించి శిక్షణ పొందుతున్న విద్యార్థులతో మాట్లాడారు. మెకట్రానిక్స్, రోబోటిక్స్, ఏఆర్‌వీఆర్, సీఎన్‌సీ కోర్సులల్లో జరుగుతున్న తరగతులను, లేబొరేటరీలను ఆమె పరిశీలించారు.

క్లుప్తంగా

ఏఆర్ పోలీసులకు ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం



ఏఆర్ పోలీస్ మైదానంలో మాట్లాడుతున్న ఎస్పీ మురళీకృష్ణ

ఆరిలోవ: ఏఆర్ పోలీసులు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాల్సిన అవసరం ఉందని అనకాపల్లి ఎస్పీ కె.వి.మురళీకృష్ణ తెలిపారు. విశాలాక్షినగర్‌లో కై లాసగిరి ఆర్మ్‌డ్ రిజర్వ్‌డ్ పోలీస్ మైదానంలో శుక్రవారం నిర్వహించిన స్టాఫ్ పరేడ్‌ను ఆయన సందర్శించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ 50 సంవత్సరాలు దాటిన ఏఆర్ పోలీసులు ఆరోగ్యంపై జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఇంత వరకు ఏఆర్‌లో పనిచేస్తున్న సుమారు 200 మందికి పైగా ఉచితంగా ప్రైవేట్ ఆస్పత్రుల్లో వివిధ రకాల ఆరోగ్య పరీక్షలు నిర్వహించామన్నారు. వారంతా వైద్యుల సూచనల మేరకు క్రమం తప్పకుండా మందులు వాడి ఆరోగ్యంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ పి.నాగేశ్వరరావు, ఆర్ఐలు, తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల పిల్లలకు 50 శాతం ఫీజు రాయితీ

తుమ్మపాల: జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థల్లో 50 శాతం ఫీజు రాయితీ కల్పిస్తూ కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి శుక్రవారం మెమో జారీ చేశారు. తమ పిల్లల చదువుకు ఆయా విద్యా సంస్థల్లో ఫీజు రాయితీ కోరుతూ ఏపీ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టు నాయకులు కలెక్టర్‌కు ఇటీవల వినతి పత్రం అందించారు. ఈ మేరకు 2023–24 విద్యా సంవత్సరంలో అక్రిడేటెడ్ జర్నలిస్టుల పిల్లలకు ఆయా ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థలు 50 శాతం ఫీజు రాయితీని అమలు చేయాలని కలెక్టర్ ఆదేశాలు చేశారు. ప్రొసీడింగ్స్‌ను జిల్లాలోని అన్ని ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థల యాజమాన్యాలకు, జిల్లా విద్యాశాఖ అధికారికి, ఎంఈవోలకు పంపించినట్లు కలెక్టరు తెలిపారు.

ముఖ్యమంత్రి మానస పుత్రిక జగనన్న సురక్ష

- జిల్లా వ్యాప్తంగా 522 సచివాలయాల్లో 3.46,712 మందికి సేవలు
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్



ప్రజా ప్రతినిధులను సత్కరిస్తున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్

మునగపాక: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మానస పుత్రిక జగనన్న సురక్ష దేశంలోనే ఆదర్శ కార్యక్రమంగా పేరుగాంచిందని వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ తెలిపారు. శుక్రవారం మునగపాకలోని బొడ్డేడ క్యాంప్ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. జగనన్న సురక్షలో భాగంగా జిల్లా వ్యాప్తంగా 522 గ్రామ సచివాలయాల్లో క్యాంపులు నిర్వహించగా, 3,59,957 దరఖాస్తులకుగాను 3,46,712 మంది లబ్ధిదారులకు అవసరమయ్యే ధ్రువీకరణ పత్రాలు అందజేసిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. స్థానిక శాసనసభ్యుడు యూవీ రమణమూర్తిరాజు ప్రత్యేక కృషితో నియోజకవర్గంలో 73,902 దరఖాస్తులకుగాను 70,727 మందికి సేవలందించే అవకాశం దొరికిందన్నారు. వలంటీర్లు, సచివాలయ ఉద్యోగుల కృషి ఫలితంగా అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ధ్రువీకరణ పత్రాలు అందజేశారన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక వలంటీర్, సచివాలయ వ్యవస్థలు అందుబాటులోకి తీసుకురావడం ద్వారా ప్రజలకు సకాలంలో మెరుగైన సేవలందుతున్నాయన్నారు. అవినీతికి తావులేకుండా ప్రతి అర్హునికి సంక్షేమ పథకాలు అందించేందుకు ఎంతో కృషి చేస్తున్నారన్నారు. అర్హులై ఉండి పథకాలను అందుకోలేని వారికోసం జగనన్న సురక్ష దోహదపడిందన్నారు. గత ప్రభుత్వ హయాంలో ప్రజలు తమకు అవసరమయ్యే సేవల కోసం కార్యాలయాల చుట్టూ తిరిగేవారని, నేడు వారి ముంగిటకే అందుతున్నాయన్నారు. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో పార్టీ జెండా ఎగురవేయడం ఖాయమన్నారు. ఈ సందర్భంగా ఆయన పలువురు ప్రజా ప్రతినిధులను సత్కరించారు. సమావేశంలో పార్టీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, జెడ్పీటీసీ పెంటకోట స్వామి సత్యనారాయణ, వైస్ ఎంపీపీలు బోజా లక్ష్మి శ్రీనివాసరావు, చిందాడ దేవి, సచివాలయాల మండల కన్వీనర్ పాలిమేర గణేష్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పిల్లి కనకలక్ష్మి అప్పారావు, మునగపాక, వాడ్రాపల్లి, అరబుపాలెం, మూలపేట సర్పంచ్‌లు దిమ్మల అప్పారావు, కాండ్రేగుల నూకరాజు, బొడ్డేడ శ్రీనివాసరావు, భీశెట్టి గంగప్పలనాయుడు, బీసీ సెల్ మండల అధ్యక్షుడు కాండ్రేగుల జగన్, మాజీ వైస్ ఎంపీపీ దొడ్డి వరహా, పార్టీ మహిళా విభాగం అధ్యక్షురాలు శీరా రమణమ్మ, ఎంపీటీసీ సూరిశెట్టి రాము పాల్గొన్నారు.

నాన్ షెడ్యూల్ ఆదివాసీల పాదయాత్ర ప్రారంభం



పాదయాత్ర చేస్తున్న ఆదివాసీలు

నర్సీపట్నం: సమస్యల పరిష్కారానికి ఐదో షెడ్యూల్ సాధన సమితి ఆధ్వర్యంలో ఆదివాసీలు చేపట్టిన పాదయాత్ర శుక్రవారం నర్సీపట్నం ఆర్డీవో కార్యాలయం వద్ద ప్రారంభమైంది. ఈ పాదయాత్రను అఖిల భారత ఆదివాసీ సంఘం ఏపీ అధ్యక్షుడు రేచుకుట్ల సింహాచలం జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాదయాత్ర ఈ నెల 7న కలెక్టర్ కార్యాలయం వద్ద ముగియనుందని, ప్రజలందరూ మద్దతు తెలియజేయాలని కోరారు. అఖిల భారతి వ్యవసాయ గ్రామీణ కార్మిక సంఘం జాతీయ కార్యదర్శి పి.ఎస్.అజయ్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో ఆదివాసీలకు పాడేరు ఐటీడీఏ సేవలను వర్తింపజేయాలన్నారు. జిల్లాలో నాన్ షెడ్యూల్ ఆదివాసీలకు రక్షణ లేకుండా పోతుందన్నారు. రెవెన్యూ, పోలీసు అధికారుల సహకారంతో భూస్వాములు ఆదివాసీల భూములను కాజేయడానికి చూస్తున్నారన్నారు. చీడికాడ మండలం, కోనం శివారు గుంటి కొండదొర ఆదివాసీలు తరతరాలుగా సాగు చేస్తున్న బంజరు భూముల్లోకి వెళ్లొద్దని, అవి గిరిజనేతరులకు చెంది ఉన్నాయని తహసీల్దార్, పోలీసులు హెచ్చరిస్తున్నారని వాపోయారు. జిల్లాలు మారినంత మాత్రాన ఐటీడీఏ సేవలను నిలిపివేయటం సరికాదన్నారు. చీడికాడ, వి.మాడుగుల, రోలుగుంట, రావికమతం, గొలుగొండలో ఆదివాసీలు ఎదుర్కొంటున్న భూసమస్యలపై రెవెన్యూ అధికారులు ముఖాముఖీ సమీక్ష నిర్వహించాలన్నారు. ఏపీ గిరిజన హక్కుల సంఘం నాయకులు నల్లి కళ్యాణం, మానవ హక్కుల వేదిక నాయకులు వి.ఎస్. కృష్ణ, వెంకటరావు, సీపీఐఎంఎల్ లిబరేషన్ రాష్ట్ర కమిటీ సభ్యులు ఎస్.గణేష్, బి.బంగారావు, లోకం భాస్కరరావు, స్వేరో నాయకుడు సాల్మన్‌రాజు, గిరిజనులు పాల్గొన్నారు.

20 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత

నర్సీపట్నం: ఆటోలో తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని శుక్రవారం పోలీసులు పట్టుకున్నారు. సీఎస్‌డీటీ చందన తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని ఐదు రోడ్లలో వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా, రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న ఆటోను పట్టుకున్నారు. సివిల్ సప్లయి అధికారులు ఆటోలో 20 బస్తాల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న కార్తీక్‌పై కేసు నమోదు చేశామని సీఎస్‌డీటీ తెలిపారు. అయితే ఒక్కో బస్తాలో 20 నుంచి 30 కేజీల వరకు బియ్యం ఉన్నట్టు తెలుస్తోంది.

గడ్డపారతో దాడి చేసిన మహిళ అరెస్ట్



దాడిలో గాయపడిన చినతల్లి

మాకవరపాలెం: మహిళపై దాడి చేసిన మరో మహిళను అరెస్టు చేశామని ఎస్ఐ రామకృష్ణారావు తెలిపారు. మండలంలోని బయ్యవరంలో రెండు కుటుంబాల మధ్య తగాదాలున్నాయన్నారు. ఈ నేపథ్యంలో గ్రామానికి చెందిన లాలం చినతల్లి(58)ని ఇదే గ్రామస్తురాలు లాలం లక్ష్మి(45) గడ్డపారతో తలపై తీవ్రంగా గాయపరిచిందని తెలిపారు. దీంతో బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి లక్ష్మిని అరెస్టు చేసినట్టు ఎస్ఐ శుక్రవారం తెలిపారు. బాధితురాలు ఆస్పత్రిలో చికిత్స పొందుతుందన్నారు.

క్రిమిసంహారక మందు తాగి గీత కార్మికుడు ఆత్మహత్య



మృతుడు దమ్ము అప్పారావు

యలమంచిలి: మండలంలోని పులపర్తి గ్రామానికి చెందిన గీత కార్మికుడు దమ్ము అప్పారావు (37) అనారోగ్యం, ఆర్థిక ఇబ్బందులతో క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. రూరల్ ఎస్సై సన్నిబాబు వివరాల ప్రకారం... గురువారం సాయంత్రం తన ఇంట్లో వ్యవసాయ పనులకు ఉపయోగించే క్రిమిసంహారక మందు తాగాడు. దీన్ని గమనించిన కుటుంబ సభ్యులు నక్కపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స చేసి కేజీహెచ్‌కు తరలించగా, చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ శుక్రవారం తెలిపారు.

నిరుపేదల అండగా సీఎం సహాయ నిధి

డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు



మహిళకు సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేస్తున్న డిప్యూటీ సీఎం బూడి

దేవరాపల్లి: అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఎంతోమంది నిరుపేదలకు సీఎం సహాయ నిధితో సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అండగా నిలుస్తున్నారని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అన్నారు. మండలంలోని తారువ క్యాంప్ కార్యాలయంలో కె.ఎం.పాలెంకు చెందిన బాధితురాలు నెల్లూరు పుష్పకు రూ.3 లక్షల సీఎం సహాయ నిధి చెక్కును శుక్రవారం ఆయన అందజేశారు. నిరుపేద కుటుంబానికి చెందిన ఆమె అనారోగ్యం బారినపడటంతో ఇటీవల ప్రైవేటు ఆస్పత్రిలో వైద్యం చేయించుకుంది. ఈ మేరకు సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేయగా, ఈ మొత్తం మంజూరైంది. సీఎం జగన్‌కు, డిప్యూటీ సీఎంకు రుణపడి ఉంటామని ఈ సందర్భంగా ఆమె కృతజ్ఞతలు తెలియజేశారు. కె.ఎం.పాలెం సర్పంచ్ గంధం రామకృష్ణ పాల్గొన్నారు.

త్వరితగతిన జగనన్న గృహాల నిర్మాణం

- అధికారులకు కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి ఆదేశం
- కలపాకలో విస్తృత పర్యటన



అధికారులు, సచివాలయ సిబ్బందితో సమీక్షిస్తున్న కలెక్టర్

పరవాడ: జగనన్న గృహ నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి ఆదేశించారు. మండలంలోని కలపాక గ్రామంలో శుక్రవారం కలెక్టర్ విస్తృతంగా పర్యటించారు. తొలుత జగనన్న కాలనీని సందర్శించారు. అక్కడ అంపూర్తిగా ఉన్న ఇళ్లను త్వరగా పూర్తి చేయడానికి చర్యలు చేపట్టాలని సూచించారు. ఇళ్ల నిర్మాణ విషయంలో ఏమైనా ఇబ్బందులు ఉంటే సంబంధిత హౌసింగ్ అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించుకోవాలన్నారు. లబ్ధిదారులకు అవసరమైన మెటీరియల్ వెంటనే సరఫరా చేసి ఇళ్లను సకాలంలో పూర్తి అయ్యే విధంగా చూడాలని అధికారులను ఆదేశించారు. గృహ ప్రవేశాలు చేసిన లబ్ధిదారులతో కాసేపు మాట్లాడారు. అదే గ్రామంలో నాడు–నేడులో అభివృద్ధి చేస్తున్న పాఠశాల భవనాన్ని కలెక్టర్ పరిశీలించారు. గ్రామ సచివాలయాన్ని సందర్శించిన రికార్డులను పరిశీలించి ఉద్యోగులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. సచివాలయాలనికి వివిధ పనులపై వచ్చే ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. అనంతరం కలపాక శివారు మూలస్వయంభూవరంలోని ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. ఎన్టీపీసీ కాలుష్యంలో చిక్కుకున్న తమ గ్రామాన్ని సురక్షిత ప్రాంతానికి తరలించడానికి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కలెక్టర్‌కు విన్నవించారు. ఆయన వెంట ఎంపీడీవో వి.హేమసుందర్రావు, తహసీల్దార్ పి.కనకారావు, సర్పంచ్ బొండా కనకారావు, ఈవోపీఆర్డీ పద్మజ, హౌసింగ్ ఏఈ ఎంఎస్ఎన్ రెడ్డి, పంచాయతీ రాజ్ ఏఈ జి.రామారావు, ఈపీడీసీఎల్ ఏఈ శేష సాయి, పంచాయతీ కార్యదర్శి సుభాష్, వీఆర్వో భుజంగరావు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

లిఫ్ట్ అడిగిన మహిళ నగలతో ఉడాయింపు



బాధితురాలు

నక్కపల్లి: ఓ మహిళ లిఫ్ట్ అడిగిన పాపానికి బెదిరించి ఆమె మెడలో బంగారం వస్తువులు ఎత్తుకుపోయిన సంఘటన శుక్రవారం ఉద్దండపురం సమీపంలో జరిగింది. రమణయ్యపేటకు చెందిన కర్రి వరలక్ష్మి కొద్దికాలం నుంచి పాయకరావుపేటలో నివాసముంటోంది. డ్వాక్రా పని మీద కొడుకుతో కలిసి ఉద్దండపురం వరకు వచ్చింది. అక్కడ నుంచి రమణయ్యపేట వెళ్లేందుకు అటుగా వెళ్తున్న ఒక వ్యక్తిని బైక్ లిఫ్ట్ అడిగింది. వెంటనే అతను బైక్ ఎక్కించుకొని ఉద్దండపురం దాటగానే బెదిరించి ఆమె శరీరంపై ఉన్న బంగారం లాక్కోవడానికి ప్రయత్నించాడు. ఈమె ప్రతిఘటించడంతో బలవంతంగా రెండు తులాల పుస్తెల తాడు, తులం తాడు పట్టుకుని పరారయ్యాడు. దాంతో బాధితురాలు లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయించింది. ఆమె ఫిర్యాదు మేరకు ఎస్ఐ శిరీష కేసు నమోదు చేశారు. నిందితుల కోసం సీసీటీవీ పుటేజీ ద్వారా గాలిస్తున్నారు.

విశాఖ వెళ్లి పింఛన్ల అందజేత



రాములమ్మకు పింఛన్ అందజేస్తున్న కాశీపురం వలంటీరు



కొండమ్మకు పింఛన్ అందిస్తున్న కొత్తకోట వలంటీరు

దేవరాపల్లి/రావికమతం: విశాఖపట్నంలో వివిధ కారణాలతో ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న పింఛనుదారులకు ఈ నెల పింఛన్ చేతికందలేదని వారు బెంగ పడకుండా వలంటీర్లు మానవత్వం చాటుకున్నారు. దేవరాపల్లి మండలం కాశీపురం గ్రామానికి చెందిన చిటిమిరెడ్డి రాములమ్మ అనారోగ్యంతో విశాఖలోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. విషయం తెలుసుకున్న వలంటీరు ఫాతిమా తన సొంత ఖర్చులతో అక్కడకు వెళ్లి పింఛన్ సొమ్ము అందజేసింది. రావికమతం మండలం కొత్తకోట గ్రామ వలంటీరు డి.ఉమేష్‌చంద్ర కేజీహెచ్‌కు వెళ్లి అక్కడ చికిత్స పొందుతున్న ఇంటి కొండమ్మకు శుక్రవారం పింఛన్ సొమ్ము అందించాడు.

హస్తకళా ప్రదర్శన ప్రారంభం




చేనేత వస్త్రాలను పరిశీలిస్తున్న ఆర్డీవో జయరాం


నర్సీపట్నం: చేనేత వస్త్రాలను ఆదరించాలని ఆర్డీవో హెచ్.వి.జయరాం కోరారు. పట్టణంలోని టీటీడీ కల్యాణ మండపంలో భావనారుషి చేనేత హస్తకళా కారిక సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చేనేత హస్తకళా ప్రదర్శనను ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంస్కృతి, సాంప్రదాయాలకు నిలయమైన చేనేత హస్తకళలను ఆదరించి, చేనేత పరిశ్రమకు చేయూతనివ్వాల్సిన అవసరం ఉందన్నారు. హస్తకళ ప్రదర్శనను తిలకించాలన్నారు. అనంతరం హస్తకళ ప్రదర్శనలో ఏర్పాటు చేసిన పోచంపల్లి, నారాయణపేట, ఉప్పాడ, చీరాల, మంగళగిరి, భాగల్‌పూర్ సిల్క్, బాంధిని సిల్క్, గుజరాత్ డిజైన్ టాప్స్, లక్నో వర్క్, వరంగల్ టవల్స్ స్టాల్స్‌ను పరిశీలించారు. హస్తకళ ప్రదర్శన ఈ నెల 20వ తేదీ వరకు ఉంటుందని నిర్వాహకుడు బట్ట సురేష్ తెలిపారు.

ప్రియుడి మోజులో భర్తనే కడతేర్చింది

- కానిస్టేబుల్ హత్యలో కుట్ర భార్యదే..
- వివరాలు వెల్లడించిన పోలీస్ కమిషనర్ త్రివిక్రమ్ వర్మ
- శివాని, ఆమె ప్రియుడు సహా మరొకరు అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న సీపీ త్రివిక్రమ్ వర్మ



నిందితులు శివాని, రామారావు, నీలా

ఎంవీపీకాలనీ: వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ కానిస్టేబుల్ రమేష్ మృతి విషయంలో తొలి నుంచి అనుమానిస్తున్నదే జరిగింది. శివజ్యోతి అలియాస్ శివానీయే ఆమె ప్రియుడితో కలిసి తన భర్త రమేష్ హత్యకు కుట్ర పన్నినట్లు పోలీసుల విచారణలో తేలింది. నగర పోలీస్ కమిషనర్ త్రివిక్రమ్ వర్మ శుక్రవారం ఈ కేసు వివరాలను వెల్లడించారు.

2009 బ్యాచ్‌కు చెందిన బర్రి రమేష్(35) ఆదర్శనగర్‌లో ఉంటూ వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. బుధవారం ఉదయం అతను చనిపోయినట్లు ఎంవీపీ పోలీసులకు సమాచారం వచ్చింది. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు బెడ్‌పై విగతజీవిగా ఉన్న రమేష్ ను పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. రాత్రి మద్యం సేవించి పడుకున్నాడని, తెల్లవారి లేచి చూసేసరికి చనిపోయి ఉన్నాడని అతని భార్య పోలీసులకు చెప్పింది. అతని ఒంటిపై ఎలాంటి గాయాలు లేకపోవడంతో అనుమానాస్పద మృతిగా పోలీసులు కేసు నమోదు చేశారు. కేసు దర్యాప్తు సమయంలో ఆమె పొంతన లేని సమాధానాలు చెప్పడంతో పోలీసులకు అనుమానం వచ్చింది. తమదైన శైలిలో విచారించడంతో అసలు వాస్తవాలు బయటకొచ్చాయి. పోస్టుమార్టం నివేదికలో సైతం అతను ఊపిరాడక చనిపోయినట్లు తేలింది. దీంతో పోలీసులు ఈ కేసును లోతుగా దర్యాప్తు చేయడంతో కుట్రకోణం వెలుగుచూసింది.

రామారావు అనే టాక్సీ డ్రైవర్‌తో వివాహేతర సంబంధం పెట్టుకున్న రమేష్ భార్య శివాని.. అతని మోజులో కట్టుకున్న భర్తను మట్టుబెట్టింది. రామా రావు విషయంలో గతంలో భార్యాభర్తల మధ్య గొడవలు జరిగాయి. కాగా.. మంగళవారం రాత్రి ఆమె రమేష్‌తో బాగా మద్యం తాగించి.. దాన్ని వీడియో కూడా తీసింది. కొంతసేపటికి అతను నిద్రలోకి జారుకున్నాడు. అప్పటికే అక్కడ మాటు వేసిన ఆమె ప్రియుడు రామారావుకు సమాచారం ఇవ్వడంతో.. అతని స్నేహితుడు నీలాతో కలిసి ఇంట్లోకి వచ్చాడు. ఆమె సమక్షంలోనే అతనిని వీరు హత్య చేశారు. నీలా రమేష్‌కి ఊపిరాడకుండా దిండుతో నొక్కిపట్టుకోగా.. రామారావు కదలకుండా అతని కాళ్లు పట్టుకున్నాడు. కొద్దిసేపటికి ఊపిరాడక రమేష్ మృతి చెందాడు. ఇలా పక్కాగా రమేష్‌ను హతమార్చిన శివాని, అతని ప్రియుడు రామారావు దీన్ని సాధారణ మృతిగా చిత్రీకరించే ప్రయత్నం చేశారు. ఇందులో భాగంగానే తొలుత మద్యం తాగి చనిపోయాడని శివాని పోలీసులకు చెప్పినట్లు సీపీ వెల్లడించారు. ఈ కేసును పూర్తిస్థాయిలో దర్యాప్తు చేసి వాస్తవాలను రాబట్టినట్లు తెలిపారు. శివానీని ఏ1గా, ప్రియుడు రామారావును ఏ2గా, వారికి సహకరించిన నీలాను ఏ3గా నిర్ధారించి కేసు నమోదు చేశారు. అనంతరం వారిని రిమాండ్‌కు తరలించారు.

తొలి నుంచి శివానీది నేర స్వభావమే..

రమేష్ భార్య శివానీది తొలి నుంచి నేర స్వభావమే అని సీపీ తెలిపారు. తల్లిదండ్రులతో సైతం ఆమె పలుమార్లు గొడవ పడినట్లు చెప్పారు. ప్రియుడి విషయంలో భార్యను పలుమార్లు రమేష్ మందలించాడని వెల్లడించారు. ఆమె తీరు కారణంగా విసిగిపోయి ఒక దశలో ఇద్దరు కుమార్తెలను తన వద్ద వదిలేసి ప్రియుడితో వెళ్లిపొమ్మని కూడా ఆమెకు చెప్పాడన్నారు. అయితే పిల్లలు, ప్రియుడు ఇద్దరూ కావాలనే ఉద్దేశంతో శివాని రమేష్ హత్యకు కుట్ర పన్నింది. ఈ హత్యలో సహకారానికి శివానీ, ప్రియుడు రామారావు అతని స్నేహితుడు నీలాకు రూ.లక్ష సుపారి కూడా ఇచ్చినట్లు సీపీ వెల్లడించారు.

క్లుప్తంగా

శభాష్ వలంటీర్



చలపాక మాణిక్యానికి పింఛన్ సొమ్ము అందిస్తున్న వలంటీర్ బొండా గణేష్

కశింకోట: మండలంలోని వెదురుపర్తి గ్రామానికి చెందిన వలంటీర్ ఆస్పత్రికి వెళ్లి పింఛన్ లబ్ధిదారునికి శుక్రవారం నగదు అందించి విధుల్లో తన నిబద్ధతను చాటుకున్నారు. వెదురుపర్తికి చెందిన చలపాక మాణిక్యం ప్రమాదవశాత్తూ కాలు విరిగి అనకాపల్లి ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. అతనికి ఆగస్టు నెల పింఛన్ సొమ్ము అందించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో గ్రామ వలంటీర్ బొండా గణేష్ గ్రామ నాయకుడు అల్లవరపు హరి బాబుతోపాటు అనకాపల్లి ఆస్పత్రికి వెళ్లి లబ్ధిదారుడికి పింఛన్ సొమ్ము అందించారు. వెల్ఫేర్ అసిస్టెంట్ నాయుడుతోపాటు, గ్రామస్తుల ప్రశంసలు అందుకున్నారు.

ట్రిపుల్ ఐటీకి ముగ్గురి ఎంపిక



శివచరణ్ రాజాదుష్యంత్ స్వామి

అనకాపల్లిటౌన్: స్థానిక మహాత్మా జ్యోతీరావు పూలే బీసీ సంక్షేమ గురుకుల పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు ట్రిపుల్ ఐటీ రెండో జాబితాలో ఎంపికయ్యారు. పాఠశాల నుంచి టెన్త్‌లో మంచి మార్కులతో ఉత్తీర్ణులైన బండారు శివచరణ్, కె.రాజాదుష్యంత్, ఎస్.స్వామిలు ప్రవేశం పొందారు.

అభిమానుల సహకారంతో ఎన్టీఆర్ విగ్రహ ఏర్పాటు



ప్రమాదంలో కూలిన ఎన్టీఆర్ విగ్రహ స్థలాన్ని పరిశీలిస్తున్న దాడి వీరభద్రరావు

అనకాపల్లి టౌన్: ఇటీవల లారీ ప్రమాదంలో ధ్వంసమైన ఎన్టీ రామారావు విగ్రహం స్థానంలో కొత్త విగ్రహాన్ని స్థానిక విజయరామరాజుపేటలో ఎన్టీఆర్ అభిమానులు ఏర్పాటు చేస్తున్నట్లు మాజీ మంత్రి దాడి వీరభద్రరావు అన్నారు. శుక్రవారం విగ్రహం కూలిన స్థలాన్ని ఆయన పరిశీలించారు. డివైడర్ ప్రారంభంలో విగ్రహం ఏర్పాటు చేస్తే మరలా ప్రమాదానికి గురయ్యే అవకాశముందని, పాత స్థలానికి పది అడుగుల వెనుకగా కొత్త విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. పైలాన్, విగ్రహ ఏర్పాటుకు తగు డిజైన్ తీసుకుని పని ప్రారంభించాలన్నారు.

అనకాపల్లి సినిమాలు

బేబి	రాజా
మెగ్ 2	సత్యనారాయణ స్క్రీన్-1
సూర్య S/O కృష్ణన్(మార్నింగ్, మ్యాట్నీ షోలు)	
దిల్‌సే	సత్యనారాయణ స్క్రీన్-2
కృష్ణగాడు అంటే ఒకరేంజ్	షిర్డిసాయి
బ్లడ్-చాక్లెట్	పర్తిసాయి
ఎల్‌జీఎం(లెట్స్ గెట్ మ్యారీడ్)	వెంకటేశ్వర
అన్నపూర్ణ ఫొటో స్టూడియో	శ్రీసత్య
బ్రో	రామచంద్ర

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు శుక్రవారం 33 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,170	4,170
రెండో రకం	3,850	3,850
మూడోరకం	3,800	3,810

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 52 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-3 యూనిట్లు, ఏ నెగిటివ్-2 యూనిట్లు, బీ పాజిటివ్-24యూనిట్లు, ఓ పాజిటివ్-19 యూనిట్లు, ఓ నెగిటివ్-1 యూనిట్, ఏబీ పాజిటివ్-3 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య(9848418400)ను సంప్రదించవచ్చు.

తల్లి పాలు.. బిడ్డకు మేలు

- బిడ్డ పుట్టిన అరగంటలోపే పాలివ్వాలి
- ముర్రు పాలతో బిడ్డలో వ్యాధి నిరోధక శక్తి
- ఈ నెల 7వ తేదీ వరకు తల్లిపాల వారోత్సవాలు

బిడ్డ భూమిపైకి వచ్చి కళ్లు తెరిచిన తొలి క్షణం చూసేది తల్లి ముఖాన్నే. వెతికేది తల్లి పాల కోసమే. శిశువు ఆయుష్షు, ఆరోగ్యం పెంచడంలో తల్లిపాలే ప్రధానం. అమ్మపాలు అమృతంతో సమానం. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా ఐసీడీఎస్ అనకాపల్లి ప్రాజెక్టు పరిధిలో గర్భిణులకు, బాలింతలకు తల్లిపాల ఆవశ్యకతపై అవగాహన పెంచుతున్నారు.

అనకాపల్లి రూరల్: బిడ్డకు తల్లిపాలు ఇచ్చినంత బలం మరే పదార్థాలూ అందించలేవు. తల్లి నుంచి బిడ్డకు మాతృ ప్రేమతో పాటు పోషకాలు, వ్యాధి నిరోధక శక్తి అందించేవి తల్లిపాలు. ఇవి బిడ్డను జీవితకాలం రక్షించే ఔషధం. అయితే కొందరు తల్లులు ఉరుకుల పరుగుల జీవితంతో, మరికొందరు నిర్లక్ష్యంతో బిడ్డకు పోతపాలు పడుతుంటారు. కొన్ని అపోహలు, ఆధునిక పోకడలతో మరి కొందరు వారి బిడ్డలకు శ్రేష్టమైన తల్లిపాలను దూరం చేస్తున్నారు. దీంతో శిశు మరణాలు పెరిగేందుకు కారణమవుతున్నారు. ఈ నేపథ్యంలోనే ఏటా ఆగస్టు మొదటి వారం(1 నుంచి 7 వరకు)లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తున్నారు.

ముర్రుపాలతో ఎంతో మేలు

బిడ్డ పుట్టిన అరగంటలోపు నుంచి ఆరు నెలల వరకు తల్లిపాలు తప్ప మరే ఇతర పదార్థాలూ ఇవ్వరాదు. తల్లిపాలు బిడ్డకు తేలికగా జీర్ణమవుతాయి. శ్వాసకోశ, అలర్జీ, ఆస్తమా, కామెర్లు, టైఫాయిడ్, మలేరియా, చర్మవ్యాధుల నుంచి పిల్లలను రక్షిస్తాయి. బిడ్డ మానసిక, శారీరక వికాసానికి అవసరమైన పోషకాలు అందిస్తాయి. రోజులో బిడ్డకు 8 నుంచి 10 సార్లు లేదా ప్రతి రెండు మూడు గంటలకోసారి తల్లిపాలు తాగించాలి. పగటి పూట ఇచ్చే పాలకన్నా, రాత్రిపూట బిడ్డకు పాలిస్తే ఎదుగుదల బాగా ఉంటుంది. తల్లికీ, బిడ్డకు మంచి బంధం ఏర్పడుతుంది.



బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యతను వివరిస్తున్న వైద్య సిబ్బంది

బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు

బిడ్డకు పాలిచ్చే సమయంలో తల్లి కొన్నింటిపై ప్రత్యేకంగా శ్రద్ధ చూపాలి. బిడ్డను పడుకోబెట్టి, నిలబెట్టి పాలివ్వకూడదు. తల్లి ఒడిలో ఉంచుకుని బిడ్డకు పాలివ్వడం మేలు. పాలిచ్చే సమయంలో కెఫిన్ అధికంగా ఉండే పదార్థాలు, శీతల పానీయాలు తీసుకోవడం మంచిదికాదు. ఇది బిడ్డ శారీరక, మానసిక ఎదుగుదలపై ప్రభావం చూపుతుందని వైద్య నిపుణులు చెప్తున్నారు.

తల్లి పాల ప్రాముఖ్యతపై అవగాహన



గర్భిణులకు, బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పిస్తున్నాం. అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రతీ గర్భిణికి, బాలింతకు తల్లిపాల వల్ల బిడ్డకు కలిగే ప్రయోజనాలను, రోగనిరోధక శక్తిని వివరిస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నాం. శిశువు పుట్టిన అరగంటలోపు ముర్రుపాలు అందించేలా భావి తల్లులకు చైతన్యం కల్పిస్తున్నాం.

– ప్రభావతి, సీడీపీవో, అనకాపల్లి ప్రాజెక్టు

నియోజకవర్గం వివరాలు

అంగన్‌వాడీ కేంద్రాలు:	234
గర్భిణులు:	1360
బాలింతలు:	1174
7 నెలల నుంచి 3 ఏళ్ల పిల్లలు:	5758
3 ఏళ్ల నుంచి 6 ఏళ్ల చిన్నారులు:	2856

పాలు పుష్కలంగా రావాలంటే

గర్భిణిగా ఉన్నప్పటినుంచే అధిక పోషక విలువలున్న ఆహారం తీసుకోవాలి. పాలు, చేపలు, గుడ్లు, వెల్లుల్లిపాయ, తాజా ఆకుకూరలు, పండ్లు తగిన మోతాదులో తీసుకోవాలి. ఆహారంలో తీపి పదార్థాలు(స్వీట్లు) తీసుకోకుండా ప్రకృతి సహజంగా లభించే పండ్లు తినాలి.

పాలివ్వడం తల్లికీ మేలే..

బిడ్డకు పాలివ్వడం ద్వారా తల్లికీ ప్రయోజనాలున్నాయని వైద్యులు చెబుతున్నారు. బిడ్డకు పాలిచ్చే తల్లులకు రొమ్ము క్యాన్సర్, అండాశయ క్యాన్సర్ వచ్చే అవకాశాలు తక్కువ. రక్తహీనత, ఎముకల బలహీనత వంటి జబ్బులు రావని వైద్యులు చెప్తున్నారు. అంతేకాదు బిడ్డకు పాలివ్వడం వల్ల ప్రసవం అనంతరం వచ్చే రక్తస్రావాన్ని అదుపుచేస్తాయని వైద్యులు చెప్తున్నారు.

తల్లి పాలు ఎంతో శ్రేష్టం



బిడ్డకు తల్లిపాలు ఎంతో శ్రేష్టం. శిశువుకు మొదటి ఆరు నెలలు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలి. సాధారణ ప్రసవం అయితే పుట్టిన అరగంట లోపు, సిజేరియన్ అయితే 4 గంటల్లోపే తల్లిపాలు పట్టించవచ్చు. ముర్రుపాలలో అనేక ఔషధ గుణాలున్నాయి. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌లలో గర్భిణులు, బాలింతలకు తల్లిపాల విశిష్టతను వివరిస్తున్నాం.

– డాక్టర్ షమీమ్, వైద్యాధికారి, తుమ్మపాల పీహెచ్‌సీ

గర్భిణులు, బాలింతలకు మరింత పోషణ



కశింకోటలో కిట్లను అందిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు



నరసింగబిల్లిలో వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్ల పంపిణీలో స్థానిక నాయకులు

కశింకోట: పుట్టిన గంటలోపే బిడ్డకు తప్పనిసరిగా తల్లి పాలు ఇవ్వాలని ఐసీడీఎస్ సీడీపీవో పి.ప్రభావతి తెలిపారు. కశింకోట పంచాయతీ కార్యాలయంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో తల్లి పాల వారోత్సవాలను శుక్రవారం నిర్వహించారు. దీనిలో భాగంగా 12 అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలోని 147 మంది బాలింతలు, గర్భిణులకు రాష్ట్ర ప్రభుత్వం అందించిన వైఎస్సార్ సంపూర్ణ పోషణ(టీహెచ్‌ఆర్) కిట్లను వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు, సర్పంచ్ మంత్రి జయరజని చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా ప్రభావతి మాట్లాడుతూ తల్లిపాలు శ్రేష్టమైనవని పేర్కొన్నారు. వ్యాధి నిరోధక శక్తిని, ఆరోగ్యాన్ని పెంపొందిస్తాయన్నారు. బిడ్డ ఎదుగుదలకు దోహదపడతాయన్నారు. బాలింతలు సరైన పౌష్టికాహారాన్ని తీసుకుంటూ బిడ్డ పుట్టిన ఆరు నెలల వరకు పాలు తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. ఉద్యోగులు కూడా తమ పిల్లలకు విధి నిర్వహణ సమయంలో పాలు ఇవ్వడానికి సహకరిద్దామన్నారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్ల ద్వారా అందించే పౌష్టికాహార సరకులతో తయారు చేసిన పదార్థాలను సేవించి, ఆరోగ్యాన్ని పెంపొందించుకోవాలన్నారు. వైస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి, పంచాయతీ కార్యదర్శి ఎస్.రమేష్, ఎంపీటీసీ సభ్యులు, వార్డు సభ్యులు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఝాన్సీ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నరసింగబిల్లిలో..

మండలంలోని నరసింగబిల్లిలో తల్లి పాల వారోత్సవాలు నిర్వహించి 35 మంది బాలింతలు, గర్భిణులకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కోన నాగేశ్వరరావు, కార్యదర్శి మేరీ జోన్స్, తాళ్లపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి యు.రమేష్, ఉమా తదితరులు పాల్గొన్నారు.



83వ వార్డులో వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను అందిస్తున్న జాజుల రమేష్

అనకాపల్లిటౌన్: గర్భిణులు, బాలింతలు వైఎస్సార్ సంపూర్ణ పోషణ(టీహెచ్‌ఆర్) సరకులను ఆహారంలో భాగంగా తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా జీవించవచ్చని వైఎస్సార్‌సీపీ 83వ వార్డు ఇన్‌చార్జ్ జాజుల రమేష్ అన్నారు. స్థానిక గుండాల జంక్షన్ 5వ సచివాలయం పరిధిలో గర్భిణులు, బాలింతలకు శుక్రవారం టీహెచ్‌ఆర్ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్‌లో 3 కిలోల బియ్యం, కిలో కందిపప్పు, అర లీటర్ నూనె, 5 లీటర్ల పాలు, 2 కిలోల రాగిపిండి, కిలో అటుకులు, పావుకిలో వంతున బెల్లం, ఎండు ఖర్జూరం, వేరుశనగ చెక్కీతోపాటు 25 కోడిగుడ్లను అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ నడిశెట్టి మధు, పార్టీ నేతలు బుద్ధ భాస్కర్, ఉగ్గిన అప్పారావు, బండి ఆనంద్, బెల్లాన అనురాధ, కటారి నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

జీతాలు చెల్లించాలని టీచర్ల ధర్నా



ధర్నా చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

అనకాపల్లిటౌన్: విశాఖ ఉమ్మడి జిల్లాలో వివిధ ప్రాంతాలకు బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు తక్షణమే జీతాలు చెల్లించాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చినబ్బాయ్ డిమాండ్ చేశారు. మండలంలోని కొప్పాకలో ఉన్న డీఈవో కార్యాలయం వద్ద యూటీఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బదిలీపై జూన్ 11న స్కూల్ అసిస్టెంట్లు, 14న ఎస్‌జీటీలు కొత్త పాఠశాలల్లో చేరారని, సుమారు వెయ్యి మంది ఉపాధ్యాయులకు ఇంకా జీతాలు అందలేదన్నారు. రాష్ట్ర స్థాయిలో డీటీఏ వద్ద ఈ ప్రక్రియ పెండింగ్‌లో ఉందని, సంబంధిత అధికారులు బాధ్యత వహించి, చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ ఎల్లయ్యబాబు, సీనియర్ నాయకులు చిట్టయ్య, కామరాజు, శ్రీకాంత్, బాలరాజు, శంకర్, మామిడి అరుణ, రవి తదితరులు పాల్గొన్నారు.

శరవేగంగా సీసీ రోడ్డు పనులు



ఎంపీ నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న మళ్ల బుల్లిబాబు

కశింకోట: స్థానిక హౌసింగ్ కాలనీలో ఎంపీ భీశెట్టి వెంకట సత్యవతి మంజూరు చేసిన నిధులతో సిమెంట్ రోడ్ల నిర్మాణం శరవేగంగా జరుగుతోంది. కశింకోటలో అభివృద్ధి పనులకు ఎంపీ రూ.కోటి నిధులు మంజూరు చేశారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు తెలిపారు. హౌసింగ్ కాలనీలో రూ.35 లక్షలతో చేపట్టిన సిమెంట్ రోడ్ల నిర్మాణ పనుల్ని శుక్రవారం పరిశీలించారు. స్థానిక కనక మహాలక్ష్మి వీధిలోని కోటదిబ్బ నుంచి మరిడిమాంబ ఆలయం వరకు మంత్రి అమర్‌నాథ్ మంజూరు చేసిన రూ.20 లక్షలతో సిమెంట్ రోడ్డు, కాలువ నిర్మించనున్నట్లు తెలిపారు. మంత్రి కేటాయించిన నిధులతో రోడ్డు నిర్మించనున్న ప్రాంతాన్ని ఆయన పరిశీలించారు.

వంట పాత్రల వితరణ



ఎండీఎం నిర్వాహకులకు వంట పాత్రల్ని అందిస్తున్న సత్యసాయి భజన మండలి సభ్యులు

కశింకోట: మండలంలోని తాళ్లపాలెం జెడ్పీ హైస్కూల్లో మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులకు సత్యసాయి భజన మండలి ఆర్థిక సాయంతో వంట పాత్రలను శుక్రవారం అందించారు. హైస్కూల్ హెచ్ఎం విజయలక్ష్మి సుమన్, ఎంపీటీసీ సభ్యురాలు లగిసెట్టి భవాని, వైఎస్సార్ సీపీ నాయకుడు లగిసెట్టి గణేష్, స్కూల్ కమిటీ చైర్మన్ గుమ్మడి గోవింద, మాజీ చైర్మన్ గుమ్మడి శ్రీనివాస్ సమక్షంలో ఈ పాత్రలను పాఠశాలకు అప్పగించారు.

నరసింగబిల్లిలో ఉచిత వైద్య శిబిరం



విద్యార్థినికి వైద్య పరీక్షలు చేస్తున్న తాళ్లపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి రమేష్

కశింకోట: మండలంలోని నరసింగబిల్లి హెల్త్ క్లినిక్‌లో శుక్రవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించి 75 మందికి సేవలందించారు. తాళ్లపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ యు.రమేష్ రోగులను, స్కూల్ విద్యార్థులు, అంగన్‌వాడీ కేంద్రాల పిల్లలను పరీక్షించి, ఉచితంగా మందులు అందించాశారు. మధుమేహం, బీపీ రోగులను పరీక్షించి, నెలకు సరిపడా మందులు పంపిణీ చేశారు. శిబిరంలో మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్ ఉమ, సిబ్బంది పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన

అనకాపల్లిటౌన్: రోజురోజుకూ పెరుగుతోన్న సైబర్ నేరాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని రిసోర్స్ పర్సన్ చిగురుపాటి కిరణ్ సూచించారు. స్థానిక డైట్ కళాశాలలో సైబర్ సెక్యూరిటీపై రెండు రోజుల వర్క్‌షాపు శుక్రవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ నేరగాళ్ల వలలో చిక్కకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. వర్క్‌షాపు శనివారం కూడా కొనసాగనుంది. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఆర్.వైకుంఠరావు, సీఎస్ఈ విభాగాధిపతి సుజాత, అకడమిక్ కో ఆర్డినేటర్ కె.పార్వతి, స్కిల్ డెవలప్‌మెంట్ కో ఆర్డినేటర్ వెంకటేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

15న చిత్రలేఖన పోటీలు

అనకాపల్లిటౌన్: స్థానిక గవరపాలెం మళ్ల జగన్నాథం కల్యాణ మండపంలో ఈ నెల 15న చిత్రలేఖన పోటీలు నిర్వహించనున్నట్లు అనకాపల్లి ఆర్ట్స్ అకాడమీ కార్యదర్శి సీహెచ్ రామచంద్రరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంతో పాటు, అనకాపల్లి, కశింకోట, మునగపాక మండలాల్లో చదువుతున్న ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. విద్యార్థులు తమకు అవసరమైన డ్రాయింగ్ వస్తువుల్ని వారే తెచ్చుకోవాలన్నారు. బొమ్మలు వేసేందుకు డ్రాయింగ్ పేపర్‌ను మాత్రం అకాడమీ వారే అందిస్తారని పేర్కొన్నారు. పోటీలను నాలుగు విభాగాలుగా నిర్వహించనున్నట్లు తెలిపారు. గ్రూప్-ఎలో ఎల్‌కేజీ నుంచి 2వ తరగతి, గ్రూప్-బిలో 3, 4, 5 తరగతుల విద్యార్థులు, గ్రూప్-సిలో 6, 7, 8 తరగతులు, గ్రూప్-డిలో 9, 10 తరగతుల విద్యార్థులు పోటీపడతారన్నారు. గ్రూప్-ఎ చిన్నారులు తమకు నచ్చిన చిత్రాన్ని వేయవచ్చన్నారు. మిగిలిన మూడు గ్రూపుల వారు మాత్రం తుపాను బీభత్సం అనే అంశంపై తమ సృజనను ఆవిష్కరించాల్సి ఉంటుందన్నారు. పోటీల్లో గెలుపొందిన వారికి అదే రోజు సాయంత్రం 5 గంటలకు జరిగే కార్యక్రమంలో బహుమతులు అందించనున్నట్లు వెల్లడించారు.

త్వరలో రాయితీపై 'పెరటి' విత్తనాలు



కొబ్బరి మొక్కలకు జియో ట్యాగింగ్ పరిశీలనలో వెలుగు ఏపీఎం శ్రీనివాసరావు

కశింకోట: స్వయం సహాయక సంఘాల మహిళలకు డీఆర్‌డీఏ ద్వారా పెరటి తోటల విత్తనాలను రాయితీపై త్వరలో అందించనున్నట్లు వెలుగు ఏపీఎం ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని జమాదులపాలెంలో స్వయం సహాయక సంఘాల మహిళా రైతులకు రాయితీపై పంపిణీ చేసిన మేలు జాతి పండ్ల మొక్కలను శుక్రవారం పరిశీలించి, జియో ట్యాగింగ్ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరడు స్థలం, భూములున్న మహిళలు తమ కుటుంబానికి కావాల్సిన కూరగాయలు, ఆకుకూరలు తదితర పంటలు పండించేందుకు అవసరమైన నాణ్యమైన విత్తనాలను రాయితీపై అందిస్తామన్నారు. విత్తనాలు కావాల్సిన వారు తమ పేర్లను వీవోఏ, సీసీల వద్ద నమోదు చేసుకోవాలన్నారు. ఇప్పటికే 50 యూనిట్ల పెరటి కోళ్లను స్వయం సహాయక సంఘాలకు అందించినట్లు తెలిపారు. మేలు జాతి కొబ్బరి, జామ, సపోట, మామిడి, జీడి మామిడి, బత్తాయి, దానిమ్మ, నిమ్మ తదితర జాతులకు చెందిన మొక్కలను కడియం నుంచి రప్పించి రాయితీపై అందించామన్నారు. మొక్కల సంరక్షణకు సభ్య రైతులు తీసుకుంటున్న చర్యలను పరిశీలించి జియో ట్యాగింగ్ చేయిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో సీసీ రామకృష్ణ, వీవోఏ కుమారి తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా ఎల్లయ్యకాలువ పూడిక తొలగింపు



గుండాల జంక్షన్ వద్ద పూడిక తొలగింపు తర్వాత కాలువ



ఎల్లయ్యకాలువలో జేసీబీ సాయంతో పూడిక తొలగింపు

అనకాపల్లిటౌన్: స్థానిక ఎల్లయ్య కాలువ పూడిక తొలగింపు పనులు ప్రారంభించినట్లు జోనల్ కమిషనర్ ఎస్.వెంకటరమణ శుక్రవారం తెలిపారు. రూ.60 లక్షలతో గుండాల జంక్షన్ నుంచి ఎన్టీఆర్ క్రీడామైదానం, పూల్‌బాగ్ రహదారి, గవరపాలెం సంతబయలు వరకు కాలువలో పూడికను తొలగించనున్నట్లు పేర్కొన్నారు. పనుల్లో భాగంగా స్థానిక వేల్పులవీధి సీతారామ కల్యాణ మండపం వద్ద ఎల్లయ్య కాలువతోపాటు, ఇరువైపులా డ్రైనేజీ పూడిక తీత పనులను జీవీఎంసీ శానిటరీ సిబ్బంది చేపట్టారు. ఈ పనులను పర్యవేక్షించిన జెడ్సీ మాట్లాడుతూ నెలాఖరు నాటికి కాలువ పూడికతీత పనులు పూర్తవుతాయన్నారు. ఎల్లయ్యకాలువకు ఇరువైపులా ఉన్న గృహ యజమానులెవరూ కాలువలో చెత్తాచెదారం వేయకుండా సహకరించాల్సిందిగా కోరారు.

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ



మొక్కను నాటి నీరు పోస్తున్న ఉదయ్‌సాగర్

అనకాపల్లిటౌన్: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ ఇంటి వద్ద ఖాళీ స్థలాల్లో మొక్కల్ని నాటి, వాటిని సంరక్షించాలని ఎల్ఐసీ బ్రాంచ్ మేనేజర్ ఉదయ్‌సాగర్ కోరారు. స్థానిక ఎల్ఐసీ కార్యాలయ ఆవరణలో శుక్రవారం జాతీయ బీమా కార్మిక సంస్థ(ఎన్‌వోఐడబ్ల్యూ) 55వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని మొక్కలునాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవాళికి స్వచ్ఛమైన ఆక్సిజన్ కావాలంటే మొక్కలను నాటాలన్నారు. మొక్కల ద్వారానే కాలుష్య నియంత్రణ సాధ్యపడుతుందన్నారు. అంతకు ముందు కార్యాలయ ఆవరణలో 20 మొక్కలను నాటారు. కార్యక్రమంలో అసిస్టెంట్ బ్రాంచ్ మేనేజర్ రవిశంకర్, బీమా కార్మిక సంస్థ కేంద్ర కమిటీ సభ్యుడు బొడ్డేడ అప్పల నరసయ్య, ఎల్ఐసీ విశ్రాంత ఏవో మంత్రి జగదీష్, అనకాపల్లి బ్రాంచ్ ఏజెంట్స్ అధ్యక్షుడు బుద్ధ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బాలికలకు సైకిళ్ల పంపిణీ



పంపిణీ చేసిన సైకిళ్లతో తుమ్మపాల హైస్కూల్ విద్యార్థినులు

అనకాపల్లి రూరల్: మండలంలోని తుమ్మపాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న 39 మంది బాలికలకు శుక్రవారం సైకిళ్లను పంపిణీ చేశారు. రాష్ట్ర పరిశ్రమల శాఖా మంత్రి గుడివాడ అమర్‌నాథ్ చొరవ, అరబిందో ఫార్మా ఆర్థిక సహకారంతో సమకూర్చిన సైకిళ్లను సర్పంచ్ తట్ట పెంటయ్యనాయుడు విద్యార్థినులకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థినుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని మంత్రి అమర్‌నాథ్ చొరవతో నియోజకవర్గంలో 2,500 సైకిళ్లను సమకూర్చినట్టు వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యకు పెద్ద పీట వేసి, అధిక నిధులను వెచ్చిస్తోందని, విద్యార్థులు దీన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సైకిళ్లను అందుకున్న విద్యార్థినుల్లో ఉత్సాహం వెల్లివిరిసింది. మంత్రి అమర్‌నాథ్‌కు థాంక్యూ సార్ అంటూ జేజేలు పలికారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ చదరం చిన్న, స్కూల్ కమిటీ చైర్మన్ గొంతిన శ్రీను, వార్డు సభ్యులు అండిబోయిన నాగరాజు, వెలగా మోదనాయుడు, ఆర్టీసీ సత్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అక్రమ కట్టడాల తొలగింపు



అక్రమ కట్టడాలను తొలగిస్తున్న సిబ్బంది

అనకాపల్లి రూరల్: మండలంలోని తుమ్మపాల మేజర్ పంచాయతీ, తుమ్మపాల వీధిలో అక్రమ కట్టడాల తొలగింపు పనులను శుక్రవారం ప్రారంభించారు. గత 30 ఏళ్ల నుంచి ఈ వీధిలో కాలువలు, రహదారులు సరిగా లేవు. చాలా వరకు కాలువలు, రోడ్ల స్థలం ఆక్రమణలకు గురైంది. గ్రామ పంచాయతీలో ప్రజలకు అవసరమైన అభివృద్ధి పనులు చేపట్టేందుకు అడ్డంకిగా ఉన్న ఆక్రమణలు తొలగించాలంటూ ఇటీవల పంచాయతీ పాలకవర్గం తీర్మానించింది. ఇందుకు ప్రజలు, ఆక్రమణదారులు కూడా సహకరించడంతో సర్పంచ్ తట్ట పెంటయ్య నాయుడు, పంచాయతీ ఈవో శ్రీనివాసరావు నేతృత్వంలో యంత్రాల సాయంతో తొలగింపు పనులు చేపట్టారు. స్థానిక ఎంపీటీసీ పన్నీరు వెంకటలక్ష్మి, పన్నీరు చంటి, కర్రి బాబి, వార్డు సభ్యులు పర్యవేక్షించారు.

ఇంటింటి సర్వేతో సమగ్ర ఓటరు జాబితా



పోలింగ్ బూత్ పరిధి ఓటర్లతో మాట్లాడుతున్న ఆర్డీవో చిన్నికృష్ణ

అనకాపల్లిటౌన్: గ్రామస్థాయి నుంచి సమగ్ర ఓటరు జాబితా తయారు చేసేందుకు సర్వే నిర్వహిస్తున్నట్లు ఆర్డీవో ఏజీ చిన్నికృష్ణ తెలిపారు. శుక్రవారం గవరపాలెంలోని 206, 207 పోలింగ్‌బూత్‌ల పరిధి ఓటర్లు జాబితాను ఇంటింటికీ తిరిగి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్డీవో పరిధిలో అన్ని పోలింగ్ బూత్‌లలో ఓటర్ల జాబితాలను పరిశీలిస్తున్నట్లు పేర్కొన్నారు. కొత్త, పాత ఓటర్ల జాబితా పరిశీలించి, స్థానికంగా లేని ఓట్లను తొలగించి, అర్హులైన వారిని కొత్త ఓటర్లుగా నమోదు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీఎల్వోలు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.